క్లుప్తంగా

అలరించిన కవి సమ్మేళనం



శ్రీనాథ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న కవులు

మంచిర్యాలఅర్బన్‌: స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సంగీత సాహిత్య సుధా వాహిని సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీమద్భగవద్గీత ఆధ్యాత్మిక కవి సమ్మేళనం అలరించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర వాల్మీకి బోయ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమం చేయటం, అందులో శ్రీమద్భగవద్గీత కవి సమ్మేళనం నిర్వహించటం సమాజానికి ఎంతో అవసరమని సంస్థను కొనియాడారు. కవులు తమ కవితాగానం చేశారు. కార్యక్రమానికి హాజరైన కవులు, రచయితలకు శ్రీమద్భగవద్గీత గ్రంథం కానుకగా ఇచ్చి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు స్వరూపా పట్వర్ధన్, హైమావతి, రత్నజానకి, సృజన, సుశీల, పద్మ, విజయ్‌గౌడ్, రాజేశం, రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్‌: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో ముద్రించిన 2024 డైరీ, క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అపరిష్కరిస్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, పీఈటీ భాషా పండితుల అప్‌గ్రేడేషన్, టీపీఎస్ పునరుద్ధరణపై వివరించగా, ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపిస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్, జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడు బట్టారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కృష్ణ, ట్రెజరర్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం



సాయం అందిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్ 2వ వార్డుకు చెందిన రాజేశ్వరి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందగా, దహన సంస్కారాల కోసం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ రూ.10వేల సాయం ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ నాయకులు పుల్లూరి కళ్యాణ్, పల్లెరాజు, మహంకాళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో మండల పరిషత్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు ఆదివారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీష్, మాజీ సర్పంచ్‌లు లింగారావు, కాంతరావు, నాయకులు రాజన్న, సాధిక్, చెంద్రయ్య, సల్లు, సాగర్, మధు, రఘు, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం: మండలంలోని 11గ్రామపంచాయతీలకు సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నిలిచిన కరెంట్ సరఫరా

బెల్లంపల్లి: కోతులు చేసిన చేష్టలతో ఆదివారం శాంతిఖని భూగర్భ గనికి అరగంటకు పైగా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ పై గుంపులుగా చేరి కలబడడంతో ట్రాన్స్‌ఫార్మర్ పీజు కాలి పోయి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఒక కోతి మృతి చెందగా, సహచర కోతులు దానిని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లినట్లు కార్మికులు చెప్పారు.

బ్రహ్మంగారి ఆలయ కమిటీ ఎన్నిక

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రెండో జోన్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీని ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకునూరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రేవల్లి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా ముత్తోజు రాజు, ఎర్రోజు శ్రీనివాస్, వలబోజు రాజకిశోర్, కోశాధికారిగా పూసాల శ్రీనివాస్, కార్యదర్శులుగా పూసాల రాజేందర్, బోగోజు రవీంద్రచారి, కట్కోజుల నరసింహచారి, నర్సింగోజు చంద్రమౌళితో పాటు స్టీరింగ్ కమిటీ, యూత్ కమిటీని ఎన్నుకున్నారు.

ఊరంతా వ్యవసాయమే..!

- ఇంటింటికీ చేను.. కాలానుగుణంగా పంటలు
- కూరగాయల సాగే జీవనాధారం
- పాల వ్యాపారంలోనూ తమదైన ముద్ర
- ఆదర్శంగా నిలుస్తున్న కాన్కూర్ రైతులు



కాకరకాయ సాగు



దంపతులిద్దరూ కూరగాయలు సేకరిస్తూ...



అల్చంతకాయ సాగులో మహిళా రైతు

జైపూర్: వ్యవసాయమే జీవనాధారంగా ఊరంతా వినూత్న పద్ధతులతో వ్యవసాయం చేస్తూ నేటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ రైతులు. ఇంటిల్లిపాది కూరగాయల పంటల సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. సమగ్ర వ్యవసాయం చేస్తూ, కూరగాయల సాగుకు పెట్టింది పేరుగా జైపూర్ మండలం కాన్కూర్ గ్రామం నిలుస్తోంది. గ్రామంలో 280కుటుంబాలు ఉండగా, 200కు పైగా కుటుంబాలు కూరగాయల పంటలు సాగు చేస్తూ జీవనం గడుపుతున్నారు. వారికి ఉన్న కొద్ది భూమిలో వరి పంటతో పాటు, అన్నిరకాల కూరగాయల పంటలు సాగు చేస్తూ వాటిని పరిసర ప్రాంత గ్రామాల్లో, మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఇక్కడ సాగుకు అనువుగా దుబ్బభూములు ఉండగా, రైతులు అంతా కాలానికి అనుగుణంగా మార్కెట్లో ఉండే డిమాండ్‌ను బట్టి సేంద్రీయ పద్ధతిలో టమాట, మిర్చి, కాకరకాయ, అలిచంతకాయ, వంకాయ, సోరకాయ, బీరకాయ, చిక్కుడు కాయతో పాటు పలురకాల కూరగాయలు, ఆకు కూరలను సాగు చేస్తూ వాటిని విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. మరికొందరు పంటలతో పాటు పాడిపశువులను పోషిస్తూ పాలవ్యాపారంలో లాభాలు ఘడిస్తున్నారు.

అన్నిరకాల కూరగాయలు సాగు చేస్తాం..



పంట పొలాల్లో అన్నిరకాల కూరగాయల పంటలను సాగు చేస్తాం. ఉన్నకొద్ది పొలంలో కొంతమేరకు వరి పంట వేసి, మిగితా భూమిలో సీజనల్‌గా అన్నిరకాల కూరగాయలను పండిస్తాం. పండించిన కూరగాయలను సమీప పట్టణాలకు, మార్కెట్లకు తరలించి విక్రయిస్తాం.

– మోర్ల సూరక్క, రైతు, కాన్కూర్

కలిసే పనిచేస్తాం..



మా కుటుంబం అంతా కలిసే పొలంలో పనిచేస్తాం. వరి పంటతో పాటు కూరగాయలు, ఆకు కూరల పంటలను సాగు చేస్తున్నాం. కూరగాయల పంట సాగులో లాభాలు వస్తున్నయ్. ప్రతి రోజూ మార్కెట్లో కూరగాయలను విక్రయిస్తాం.

– శ్రీనివాస్, రైతు, కాన్కూర్

అవిశ్వాసానికి రంగం సిద్ధం..!

- పీఏసీఎస్ చైర్మన్‌పై ఫిర్యాదు చేసి క్యాంపునకు తరలిన డైరెక్టర్లు



పొనకల్ సహకార సంఘం

జన్నారం: మండలంలోని పొనకల్ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌పై సభ్యులు అవిశ్వాసం పెట్టేందుకు 9మంది డైరెక్టర్లు ఇప్పటికే ఇన్‌చార్జి డీసీవో శ్రీనివాసరెడ్డికి నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో పాటుగా రాష్ట్ర కో ఆపరేటీవ్ రిజిస్ట్రార్‌కు కూడా అవిశ్వాస నోటీస్ పంపినట్లు డైరెక్టర్లు చెబుతున్నారు.

జన్నారం మండలం పొనకల్ ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలు 2020ఫిబ్రవరి 16న డైరెక్టర్లుగా 13మంది ఎన్నికయ్యారు. చైర్మన్‌గా శీలం రమేశ్‌ను, వైస్ చైర్మన్‌గా మహిపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోవడం, చైర్మన్ బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు కావడం వల్ల, అదే పార్టీకి చెందిన కొందరు, ఇతర పార్టీలకు చెందిన కొందరు డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు తెరలేపారు. రేండ్లగూడకు చెందిన అల్లం రవి ముందుండి ఈ తతంగం నడిపిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు తొమ్మిది మంది డైరెక్టర్లు కలిసి ఈ నెల 6న ఇన్‌చార్జి డీసీవో శ్రీనివాసరెడ్డికి అవిశ్వాస తీర్మానం చేస్తూ ఫిర్యాదు చేశారు. అయితే అవిశ్వాసం తీర్మానం రాష్ట్ర కో ఆపరేటీవ్ రిజిస్ట్రార్‌కు అందజేస్తేనే అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేసే అవకాశం ఉందని, కొందరు అధికారులు తెలుపడంతో, రాష్ట్ర కోఆపరేటివ్ రిజిస్ట్రార్‌కు అవిశ్వాస తీర్మానంపై ఫిర్యాదు పంపినట్లు డైరెక్టర్ అల్లం రవి తెలిపారు.

క్యాంపులో డైరెక్టర్లు..

ప్రస్తుత పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఫిర్యాదు చేసిన తొమ్మిది మంది డైరెక్టర్లు క్యాంపునకు తరలివెళ్లారు. చైర్మన్ పదవి ఆశిస్తున్న అల్లం రవి అధ్వర్యంలో క్యాంపునకు తరలివెళ్లినట్లు తెలుస్తోంది. అధికారుల నుంచి అవిశ్వాస తీర్మానం తేదీ ఖరారు చేసి, నోటీసులు వచ్చే వరకు క్యాంపులోనే ఉంటారని తెలుస్తోంది. ఈ విషయమై అల్ల రవిని 'సాక్షి' సంప్రదించగా నాతో పాటు ఎనిమిది మంది డైరెక్టర్లు క్యాంపులో ఉన్నారని, అవిశ్వాసం తీర్మానంపై ఫిర్యాదు చేశామని, అధికారుల నుంచి సమాచారం అందగానే తిరిగి వస్తామని ఆయన తెలిపారు. ప్రస్తుత చైర్మన్ శీలం రమేశ్‌ను 'సాక్షి' సంప్రదించగా మరో 11నెలలు మాత్రమే పదవి కాలం ఉన్నందునా, దీనిపై స్పందించేందుకు ఆసక్తి చూపడం లేదని, బల నిరూపణలో నా బలం చూపిస్తానన్నారు. అవిశ్వాసంలో నా వద్ద కూడా బలం ఉందని, విజయం సాధిస్తానని తెలిపారు. మంచిర్యాల ఇన్‌చార్జి డీసీవో శ్రీనివాసరెడ్డిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా పొనకల్ పీఏసీఎస్ డైరెక్టర్లు ఫిర్యాదుతో నా వద్దకు వచ్చారని, అయితే ఫిర్యాదు తీసుకుని నోటీసులు జారీ చేసే అధికారం నా వద్ద లేనందునా, రాష్ట్ర కో ఆపరేటీవ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయాలని సూచించానని, ఒక కాపీని అవగాహన కోసం నా వద్ద ఉంచుకున్నానని తెలిపారు.

10న మండలస్థాయి క్రికెట్ పోటీలు

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో ఈ నెల 10న మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సాగర్, అఖిల్ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకుని యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదారం టౌన్‌షిప్‌లోని ఎల్‌బీ స్టేడియంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు రూ.1100 ఎంట్రీఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న క్రీడా జట్లకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5గంటలకు డ్రా తీస్తామని పేర్కొన్నారు. క్రీడాపోటీల్లో విజయం సాధించే జట్టుకు ప్రథమ బహుమతి క్రింద రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేల చొప్పున నగదు అందజేస్తామని ప్రకటించారు. ఈ అవకాశాన్ని క్రికెట్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ యువత అధ్యక్షుడు దివంగత రాసమల్ల అశోక్‌గౌడ్ గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన స్మారకార్థం మండల స్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డీజే.శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి గుడిపేట శివారులో ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగుతాయన్నారు. రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు ఉంటుందని, టోర్నీలో పాల్గొనే ఆసక్తిగల జట్లు 93928 94024 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దుప్పట్లు పంపిణీ



పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రిలో మా ఊరు సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు హాజరై 25మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సేవ చేయాలనే దృక్పథంతో సంఘం ఏర్పాటు చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు ఇబ్రహీం, సభ్యులు పెద్దిరాజు, శ్రీమన్నారాయణ, ఎండీ ముజాహిద్ ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును సన్మానిస్తున్న రేషన్‌డీలర్లు

బెల్లంపల్లి: యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఏసీపీ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. యువకులను ఆకట్టుకునేలా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. సీబీసీఐడీ రిటైర్డు అడిషనల్ ఎస్పీ పి.రవికుమార్ మాట్లాడుతూ.. క్రీడలకు బెల్లంపల్లి నిలయమన్నారు. సింగరేణి కార్మికులు, యువకులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన అనుభవం ఉందని గుర్తు చేశారు. క్రీడల్లో నైపుణ్యత ప్రదర్శించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహన్, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మంచిర్యాలటౌన్: జిల్లా చౌకధరల దుకాణం సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మోటపలుకుల సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బొమ్మ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు సాగె బాపు, రాజారామ్, రామాంజనేయులు, శ్రీనివాస్, సత్యసాగర్, ప్రచార కార్యదర్శి అంకం మనోజ్, మంచిర్యాల డీలర్లు బానేష్, బూర్ల మహేందర్, అంకం తిరుపతి, ధర్మేందర్, గాండ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్లో జరిగే పీఎస్సార్ కరాటే కప్, కుంగ్‌ఫూ కప్ పోటీల నిర్వహణ పోస్టర్లను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఎం.నాగలక్ష్మి, ఆర్గనైజర్ మొకనపల్లి సరీష్, అడ్వైజర్ శశిధర్ మాట్లాడుతూ.. ఈ టోర్నమెంట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి పలు విభాగాల్లో కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఇంటింటా రాములోరి అక్షింతల పంపిణీ



ధర్మారంలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు



చెన్నూర్ పద్మనగర్ కాలనీలో పంపిణీ

చెన్నూర్: పట్టణంలోని పద్మనగర్ కాలనీలో హనుమాన్ ఆలయంలో పూజలు చేసి మేళా తాలల మధ్య పండగ వాతావరణంలో ఇంటింటికీ రాములోరి అక్షింతలను మండల సమయోజక్ నడిపల్లి లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ నాయకులు రత్న లక్ష్మీనారాయణరెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ధర్మారంలో...

భీమారం: మండలంలోని ధర్మారంలో ఆదివారం అయోధ్య రాములోరి అక్షింతలను గ్రామస్తులు పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, యువకులు సాగర్, జగదీశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వేమనపల్లి: మండలంలోని గొర్లపల్లి గ్రామంలో ఆదివారం శ్రీరామ అక్షింతలతో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. నృత్యం చేస్తూ పల్లకి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



వాకర్స్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వాకింగ్ చేసే సభ్యుల నూతన వాకర్ క్లబ్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. వాకర్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు, సభ్యులు గాజుల వెంకటేశ్, కారుకూరి చంద్రమౌళి, వీరశంకర్, జగన్ ఆధ్వర్యంలో కమిటీ నూతన అధ్యక్షుడిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా విగ్నేష్, ప్రచార కార్యదర్శిగా సాగర్ యాదవ్, కోశాధికారిగా మధు పాల్గొన్నారు.

మూడు పాఠశాలల్లోనే అల్పాహారం

- మిగతా పాఠశాలల్లో అమలుకు నోచుకోని వైనం

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం పథకం ప్రారంభంలో హడావుడి చేసింది. దండేపల్లి మండలంలో 66ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, తొలుత పైలెట్ ప్రాజెక్టు కింద కేవలం మూడు పాఠశాలల్లో మాత్రమే ఈ పథకాన్ని అమలు చేసింది. మిగతా పాఠశాలల్లో దసరా తర్వాత అమలు చేస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటివరకు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రారంభించిన పాఠశాలలే తప్పా, మిగితా పాఠశాలలకు ఈ పథకాన్ని ఇంకా విస్తరించలేదు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు నెల రోజులు గడిచింది. అన్నీ సర్కారు బడుల్లో విద్యార్థులకు అల్పాహారం పథకం అమలుపై ఇక కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అన్ని బడుల్లో పథకాన్ని అమలు చేస్తారని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.



పెద్దపేట పాఠశాలలో అల్పాహారం చేస్తూ..



అల్పాహార పథకం మెనూ..

పైలెట్ ప్రాజెక్టులో 3 పాఠశాలలు..

దండేపల్లి మండలంలో మొత్తం 66ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో 3,160 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని పెద్దపేట, గూడెం, దండేపల్లి ప్రాథమిక పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నారు. మిగితా పాఠశాలల్లో మాత్రం ఇంకా ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు.

చాలా ఇష్టంగా తింటున్నారు..

ప్రతిరోజు పాఠశాలలో ప్రార్థన సమయం కంటే ముందే విద్యార్థులకు అల్పాహారం అందించడంతో, విద్యార్థులు చాలా ఇష్టంగా తింటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలను సమయానికి పాఠశాలలో దింపి వెళ్తున్నారు. రోజుకో రకం కావడంతో, విద్యార్థులు సంతోషంగా తింటున్నారు.

- శ్రీలత, హెచ్‌ఎం, పెద్దపేట

ఆదేశాలు రాలేదు..

అల్పాహార పథకాన్ని అన్ని పాఠశాలల్లో అమలుకు ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. పథకం ప్రారంభంలో పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని పాఠశాలల్లో మాత్రమే అమలు చేయాలన్నారు. తొలుత దండేపల్లి మండలంలోని పెద్దపేట, గూడెం, దండేపల్లి ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు ఆదేశాలు వచ్చాయి. వాటిల్లోనే అమలవుతుంది. మిగితా వాటిల్లో అమలుకు ఆదేశాలు రాగానే ప్రారంభిస్తాం.

- రవీందర్, ఎంఈవో

అన్ని పాఠశాలల్లో అమలు చేయాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం పూట విద్యార్థులకు అల్పాహారం పథకాన్ని అమలుచేయడం చాలా సంతోషం. ఇదీ పైలెట్ ప్రాజెక్టు అని కేవలం కొన్ని పాఠశాలల్లో మాత్రమే అమలు చేసి, మిగితా పాఠశాలల్లో ప్రారంభించక పోవడం సరికాదు. పథకాన్ని అన్ని సర్కారు బడుల్లో అమలు చేయాలి.

- పిట్టల తిరుపతి, విద్యార్థి సంఘం నాయకుడు



ఇందిరానగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు ఇందిరానగర్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్ ముగ్గుల పోటీలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ముగ్గులను పోటాపోటీగా వేయగా, గెలుపొందిన విజేతలకు మున్సిపల్ వైస్ చైర్మన్ బహుమతులు అందించారు.



విజేతలకు బహుమతులు ఇస్తున్న ముఖేశ్‌గౌడ్

పోచమ్మకు మొక్కులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. కోళ్లు, మేకలు బలిచ్చి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.